# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 26-04-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ యువత దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి కృషి చేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారు.
- ❖ భారతదేశంలో ఎలక్ట్రానిక్స్ తయారీరంగం గత 10 సంవత్సరాలలో ఐదు రెట్లు పెరిగిందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.
- ❖ గుజరాత్‌లో ఈరోజు 550 మందికి పైగా అక్రమ వలసదారులను పోలీసులు అరెస్టు చేశారు.
- ❖ పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియలు ఈరోజు వాటికన్ సిటీలో ముగిశాయి.

============================

"రోజ్‌గార్ మేళా"లో నియామక పత్రాలు అందుకున్న యువత దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి కృషి చేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. ఈరోజు దేశవ్యాప్తంగా 47 ప్రదేశాలలో నిర్వహించిన 15వ రోజ్‌గార్ మేళాలో వివిధ ప్రభుత్వరంగ సంస్థలలో కొత్తగా నియమితులైన 51 వేలకుపైగా యువతకు దృశ్యమ మాధ్యమ విధానంలో నియామక పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి ప్రసంగిస్తూ... యువత దేశ నిర్మాణంలో పాల్గొన్నట్లయితే భారత్ అతి వేగంగా అభివృద్ధి చెందుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. నూతన ఆవిష్కరణల ద్వారా నేటి భారతీయ యువత సామర్థ్యాలను ప్రపంచం గుర్తించందని నరేంద్రమోదీ పేర్కొంటూ...

(వాయిస్ 32 సెకన్లు)

దేశ ఆధునిక మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడంతో పాటూ కార్మికుల జీవితాల్లో మార్పులు తీసుకురావాల్సిన బాధ్యత ఈరోజు నియామక పత్రాలు అందుకున్న యువతపై ఉందన్నారు. అలాగే మరికొద్ది రోజుల్లో జరగనున్న వేవ్స్ సదస్సు గురించి ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రస్తావిస్తూ ...

(వాయిస్ 32 సెకన్లు)

============================

భారతదేశంలో ఎలక్ట్రానిక్స్ తయారీరంగం గత 10 సంవత్సరాలలో 5 రెట్లు పెరిగిందని కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు 6 రెట్లు పెరిగాయని అన్నారు. ఇటీవల కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపిన ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్ తయారీ పథకానికి సంబంధించిన ఆన్‌లైన్ పోర్టల్‌ను ఈరోజు న్యూ ఢిల్లీలో ఆయన ప్రారంభించారు. ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్ తయారీ వ్యవస్థలో భారీ పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా బలమైన కాంపోనెంట్ ఎకో సిస్టమ్ అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఈ సందర్భంగా అశ్విని వైష్ణవ్ తెలిపారు.

============================

గుజరాత్‌లోని అహ్మదాబాద్, సూరత్ నగరాలలో ఈరోజు 550 మందికి పైగా అక్రమ వలసదారులను పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో ఎక్కువగా బంగ్లాదేశ్ నుండి వచ్చిన 450 మందికి పైగా వలసదారులను ఈరోజు తెల్లవారుజామున అదుపులోకి తీసుకున్నారు. నగరంలోని వివిధ ప్రాంతాలలో స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్, ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్ బృందాలు కూంబింగ్ ఆపరేషన్ నిర్వహించాయి. అలాగే సూరత్‌లో సైతం ఈరోజు జరిగిన ఆపరేషన్‌లో, నగర పోలీసులు విస్తృత సోదాలు నిర్వహించారు.

============================

పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియలు ఈరోజు వాటికన్ సిటీలో ముగిశాయి. ఆయనకు అంతిమ నివాళులు అర్పించడానికి పలు దేశాల అధ్యక్షులు, ప్రధాన మంత్రులు హాజరయ్యారు. భారత ప్రజల తరపున రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంతాపం తెలియజేశారు. అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్, ఫ్రెంచ్ అధ్యక్షులు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్, బ్రెజిల్ అధ్యక్షులు లూయిజ్ ఇనాసియో లులా డా సిల్వా, అర్జెంటీనా అధ్యక్షులు జేవియర్ మిలే వంటి ప్రముఖ నాయకులు పోప్ ఫ్రాన్సిస్ కు నివాళి అర్పించారు. ఈరోజు అంత్యక్రియలు నిర్వహించనున్న పోప్ ఫ్రాన్సిస్‌కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమంలో నివాళులర్పిస్తూ.... సమాజానికి ఆయన చేసిన సేవను ప్రపంచం ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటుందని అన్నారు.

============================

జాతీయ భద్రత దృష్ట్యా ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాలు, భద్రతా దళాల కదలికలను ప్రత్యక్ష ప్రసారం చేయవద్దని సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ అన్ని మీడియా ఛానెళ్లకు సూచనలు జారీ చేసింది. జాతీయ భద్రతను కాపాడటంలో మీడియా, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొంది. రక్షణ కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని నివేదించవద్దని మంత్రిత్వ శాఖ వారిని కోరింది. సున్నితమైన సమాచారాన్ని బహిర్గతం చేయడం వల్ల కార్యాచరణ సామర్థ్యం, సిబ్బంది భద్రతకు ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని పేర్కొంది.

విరామం

============================

జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడిని ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి తీవ్రంగా ఖండించింది. ఉగ్రవాదం ప్రపంచ శాంతికి పెద్ద ముప్పు అని, అది ఏ రూపంలో ఉన్నా దానిపై పోరాడాలని కౌన్సిల్ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ దాడికి పాల్పడినవారిని, వారికి మద్దతు ఇచ్చిన వారిని చట్టం ముందు నిలబెట్టాలని భద్రతా మండలి పిలుపునిచ్చింది.

============================

భారతదేశం 17 కోట్లకు పైగా ప్రజలను తీవ్ర పేదరికం నుండి విజయవంతంగా బయటకు తీసుకువచ్చిందని ప్రపంచ బ్యాంకు ఈరోజు విడుదల చేసిన ఒక నివేదికలో పేర్కొంది. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు పేదరికం తగ్గుదలలో మూడింట రెండు వంతుల వాటాను కలిగి ఉన్నాయని వెల్లడించింది. గ్రామీణ ప్రాంతాల్లో, 2011-12లో 18.4 శాతంగా ఉన్న పేదరికం 2022-23 నాటికి 2.8 శాతానికి తగ్గిందని పేర్కొంది. ఇక పట్టణ ప్రాంతాల్లో సైతం పేదరికం 10.7 శాతం నుండి 1.1 శాతానికి తగ్గిందని తెలియజేసింది. గత 3 సంవత్సరాలుగా భారత్ ఉపాధి కల్పనలో సానుకూల ఫలితాలను సాధిస్తోందని, ముఖ్యంగా గ్రామీణ కార్మికులు, మహిళల్లో స్వయం ఉపాధి పెరుగుదల ఆర్థిక భాగస్వామ్యానికి దోహదపడుతుందని ఆ నివేదిక పేర్కొంది.

============================

గ్రామీణ యువత రోజ్‌గార్ మేళా ద్వారా నూతన ఉద్యోగాలలో చేరి తమ కలలను సాకారం చేసుకుంటున్నారని పౌర విమానయాన మంత్రి కె.రామ్మోహన్ నాయుడు  అన్నారు. ఈరోజు విశాఖపట్టణంలో 278 మంది అభ్యర్థులకు మంత్రి నియామక పత్రాలను అందజేశారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ... ముఖ్యంగా దిగువ మధ్య తరగతి కుటుంబాల నేపధ్యాల నుంచి వచ్చిన యువత ఈ ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవడం హర్షణీయమని పేర్కొంటూ...

(వాయిస్ 32 సెకన్లు)

============================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్ మనసులోని మాట” కార్యక్రమం 121వ సంచిక రేపు ప్రసారమవుతుంది. ఈ కార్యక్రమం రేపు ఉదయం 11 గంటలకు అన్ని ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాల ద్వారా ప్రసారం కానుంది. మన్ కీ బాత్ కార్యక్రమం తెలుగు అనువాదం ప్రధానమంత్రి ప్రసంగం అయిన వెంటనే  ఒకసారి, తిరిగి రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ఆకాశవాణి కేంద్రాల ద్వారా ప్రసారమవుతుంది.

============================

ఇండియా ఆడియో సమ్మిట్ అండ్ అవార్డ్స్ 2025లో ఆకాశవాణి వివిధ విభాగాల్లో మొత్తం 6 అవార్డులను గెలుచుకుంది. నిన్న రాత్రి ముంబైలో జరిగినా ఈ వేడుకలో రేడియో, ఆడియో కంటెంట్ ప్రొడక్షన్ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు గానూ ఈ అవార్డులను ప్రధానం చేశారు. మాజీ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ కార్యక్రమం 'నయా సోచ్ నయీ కహానీ - ఎ రేడియో జర్నీ విత్ స్మృతి ఇరానీ' రేడియో విభాగంలో సిరీస్ ఆఫ్ ది ఇయర్‌గా ఈ అవార్డులకు ఎంపికైంది. ఆకాశవాణి డైరెక్టర్ జనరల్ డాక్టర్ ప్రగ్యా పాలీవాల్ గౌర్ ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరయ్యారు.

============================

పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో దేశంలో ఉన్న పాకిస్థాన్ పౌరులు వారి స్వదేశానికి వెళ్లిపోవాలని భారత ప్రభుత్వం ఆదేశించింది. ఇప్పటికే అన్ని రాష్ట్రాలు ఆ దిశగా చర్యలు చేపడుతున్నాయి. అయితే, మహారాష్ట్రలో 5 వేల మంది పాకిస్థానీయులు ఉన్నారని, ఇందులో వెయ్యి మంది స్వల్పకాలిక వీసాలు కలిగి ఉన్నారని ఆ రాష్ట్రమంత్రి యోగేశ్ కదమ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు దేశం విడిచి వెళ్లాలని వారికి సూచించామన్నారు.

============================
============================